సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం ‌। 21 । ఆగస్టు । 2024



పశువైద్యం అంతంతే..!
పశు సంవర్ధక శాఖలో సరిపడా సిబ్బంది లేక పశువులకు సరైన వైద్యం అందడం లేదు. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. 8లో



రైతుల పక్షాన పోరాడుతాం
కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై పోరాడుతామని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. 10లో



వాతావరణం
జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం తర్వాత పలు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్‌ఓఆర్ చట్టంపై 24న అవగాహన సమావేశం

కొత్తగూడెంఅర్బన్: ధరణి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన ఆర్‌ఓఆర్ చట్టంపై అవగాహన కల్పించేందుకు ఈనెల 24న ఐడీఓసీలో సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో పాటు ఆర్‌ఓఆర్ చట్టంపై అవగాహన గల వారంతా హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

అనుమతులెప్పుడో..



పనులు మధ్యలోనే నిలిచిపోయిన సీతమ్మసాగర్ ప్రాజెక్ట్

సీతారామ డీపీఆర్‌పై జీఆర్‌ఎంబీలో చర్చ

- అభ్యంతరం తెలిపిన ఆంధ్రప్రదేశ్ సర్కార్
- టెక్నికల్ అడ్వయిజరీ కమిటీకి వెళ్లిన డీపీఆర్
- 16 నెలలుగా ఆగిన సీతమ్మసాగర్ పనులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎనిమిదేళ్ల క్రితం నిర్మాణ పనులు మొదలైనా నేటికి సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)కు అనుమతి రాలేదు. దీంతో కేంద్రం నుంచి అన్ని రకాల అనుమతులు సాధించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది.

జీఆర్‌ఎంబీలో వాదనలు..

సీతారామ డీపీఆర్‌కు అతి త్వరలోనే అన్ని రకాల అనుమతులు వస్తాయని పంప్‌హౌస్ ప్రారంభోత్సవం సందర్భంగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంత్రి ప్రకటన వెలువడిన తర్వాత తొలిసారిగా మంగళవారం హైదరాబాద్‌లో గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్‌ఎంబీ) సమావేశం జరిగింది. ఇక్కడ సీతారామ ప్రాజెక్టుపై జరిగిన చర్చలో గతంలో కేంద్ర జలసంఘానికి సమర్పించిన వివరాలు, అక్కడి నుంచి వచ్చిన అనుమతులకు సంబంధించి ఇంజనీర్లు తెలియజేయగా, గోదావరిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు దక్కాల్సిన నీటి వాటాలపై స్పష్టత రాకుండానే సీతారామ ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారంటూ ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటీవల సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి కాస్ట్ బెనిఫిట్ రేషియోకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదం తెలపగా.. జీఆర్‌ఎంబీ సమావేశంలో ఇరు రాష్ట్రాలు చేసిన వాదనలపై త్వరలో సీడబ్ల్యూసీ టెక్నికల్ అడ్వైజరీ మీటింగ్‌లో మరోసారి చర్చ జరగనుంది.

కీలకంగా సీతమ్మసాగర్

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో 6.75 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో సీతారామ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఈ ఎత్తిపోతల పథకంలో భాగంగా గోదావరి నదిపై సీతమ్మసాగర్ పేరుతో బ్యారేజ్‌తో పాటు నాలుగు పంప్‌హౌస్‌లు, ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు నిర్మించాల్సి ఉంది. ఈ పనులకు 2016 ఫిబ్రవరిలో శంకుస్థాపన జరిగినా 2018 నుంచే ఊపందుకున్నాయి. మూడు పంప్‌హౌస్‌ల నిర్మాణం పూర్తికాగా, బ్యారేజ్ పనులు సైతం ప్రారంభమయ్యాయి. గోదావరి నదిపై నిర్మించే పని కావడంతో కేంద్రం నుంచి అనుమతులు తప్పనిసరి అంశంగా మారాయి.

ఆగిన పనులు

సీతారామ డీపీఆర్‌కు అన్ని రకాల అనుమతులు రాకుండానే కీలకమైన సీతమ్మసాగర్ పనులు చేపడుతున్నారంటూ గతంలో హైకోర్టులో, ఆ తర్వాత నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు నమోదయ్యాయి. అక్కడ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు వచ్చాయి. దీంతో 2023 మే చివరి వారం నుంచి సీతమ్మసాగర్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. గతేడాది సెప్టెంబర్‌లో అనుమతుల సాధన కోసం కొంత ప్రయత్నం జరిగినా ఆ తర్వాత వచ్చిన ఎన్నికల హడావిడిలో అవి మరుగున పడిపోయాయి. దీంతో గత అక్టోబర్ నుంచి జూన్ మొదటి వారం వరకు బ్యారేజ్ నిర్మాణానికి అనుకూలమైన కాలం వృథా అయ్యింది. దీంతో త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించాలనే ఆలోచనలో ఉన్న ప్రభుత్వం.. అనుమతుల సాధనకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

జల విద్యుత్

గోదావరి నుంచి 67 టీఎంసీల నీటిని ఎత్తిపోతల ద్వారా తీసుకునే విధంగా సీతారామ ప్రాజెక్టును డిజైన్ చేశారు. నీటిని ఎత్తిపోసేందుకు నాలుగు పంప్‌హౌస్‌ల్లో వివిధ సామర్థ్యాలతో మొత్తం 24 మోటార్లు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుకు 693 మెగావాట్ల విద్యుత్ అవసరమవుతుంది. అయితే గోదావరి నీటిని నిల్వ చేయడంతో పాటు 282 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి చేసేందుకు వీలుగా సీతమ్మసాగర్ బ్యారేజ్‌ను డిజైన్ చేశారు. దీంతో రాష్ట్రంలో మిగిలిన ఎత్తిపోతల పథకాలతో పోల్చితే అత్యంత తక్కువ ఖర్చుతో పొలాలకు నీరందించే ప్రాజెక్టుగా సీతారామకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే డీపీఆర్‌కు అనుమతి రాకపోవడంతో బ్యారేజ్, జల విద్యుత్ కేంద్రాల నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి.

ఆర్టీసీకి కాసుల పండుగ!

- రాఖీ సందర్భంగా ప్రయాణాల రికార్డ్
- 129 శాతం ఓఆర్‌తో రీజియన్‌లో మణుగూరు ముందంజ
- 2.72లక్షల కి.మీ. ప్రయాణంతో రూ.2.21కోట్ల ఆదాయం



ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

ఖమ్మం మయూరిసెంటర్/సత్తుపల్లిటౌన్: ఆర్టీసీకి రాఖీ పండుగ కలిసొచ్చింది. సోదరులకు రాఖీ కట్టేందుకు వెళ్లిన ఆడపడుచులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించడంతో సోమవారం ఆదాయం దండిగా లభించింది. ఖమ్మం రీజియన్‌లో అన్ని డిపోల్లో 100శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) తగ్గకపోగా.. బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టాక అత్యధిక స్థాయిలో ఓఆర్ నమోదు కావడం ఇదే తొలిసారి అని అధికారులు చెబుతున్నారు. రీజియన్‌లో మణుగూరు డిపో ద్వారా అత్యధికంగా బస్సులు 30,569 కి.మీ. మేర రాకపోకలు సాగించగా 129శాతం ఓఆర్‌తో రూ.26.98లక్షల ఆదాయం నమోదైంది.

ముందస్తు ప్రణాళికతో

రాఖీ పండుగ సందర్భంగా బస్సుల్లో రద్దీ పెరుగుతుందని అధికారులు ముందుగానే భావించారు. రీజినల్ మేనేజర్ సరిరామ్ ఆదేశాలతో డిపోమేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్‌వైజర్లతో సహా ఇతర ఉద్యోగులంతా బస్టాండ్లలో మకాం వేసి రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు బస్సులు నడిపించారు. హైదరాబాద్ నుంచి రద్దీ పెరుగుతుండగా ఖమ్మం రీజియన్‌లో డిపోలకు అదనంగా వంద సర్వీసులు నడిపించి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. అలాగే, ఖమ్మంతో పాటు ఇతర డిపోల నుంచి కొన్ని సర్వీసులు అదనంగా తిప్పారు. గతేడాది రాఖీ పండుగ రోజున 85శాతం ఓఆర్ నమోదు కాగా.. ఈసారి రీజియన్‌లో సగటున 114 ఓఆర్ శాతం సాధించడం విశేషం. కాగా, రాఖీ పండుగ రోజైన సోమవారం రీజియన్ వ్యాప్తంగా 2.87 లక్షల మంది ప్రయాణించగా ఇందులో 1.84 లక్షల మంది మహిళలు మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకున్నారు.

డిపోల వారీగా..

ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల్లో కలిపి బస్సులు 2,72,284 కి.మీ. మేర రాకపోకలు సాగించాయి. తద్వారా సంస్థకు 73శాతం ఎర్నింగ్ పర్ కిలోమీటర్(ఈపీకే)తో రూ.2.21కోట్లకు పైగా ఆదాయం లభించింది. డిపోల వారీగా పరిశీలిస్తే ఖమ్మం 75.09, మధిర 73.94, సత్తుపల్లి 66.44, భద్రాచలం 69.08, కొత్తగూడెం 80.35, మణుగూరు 80.47, ఇల్లెందు డిపో 63.76 శాతం చొప్పున ఈపీకే సాధించాయి.

సోమవారం డిపోల వారీగా బస్సులు తిరిగిన కి.మీ., ఓఆర్, ఆదాయం

డిపో	కిలోమీటర్లు	ఆదాయం (రూ.లక్షల్లో)	ఓఆర్ శాతం
ఖమ్మం	72,032	60.38	116
భద్రాచలం	56,224	42.91	107
సత్తుపల్లి	47,648	35.06	102
మణుగూరు	30,569	26.98	129
కొత్తగూడెం	28,025	25.07	128
మధిర	29,275	24.80	118
ఇల్లెందు	8,511	5.97	101
మొత్తం	2,72,284	221.17	

జడ్జి స్వప్నకు మంత్రి దామోదర అభినందన

సింగరేణి(కొత్తగూడెం): నల్లగొండ జిల్లా నిడమనూరు మున్సిఫ్ కోర్ట్ జూనియర్ సివిల్ జడ్జి టి.స్వప్న ప్రసవం కోసం కొత్తగూడెం(రామవరం)లోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో చేరి, ఆడబిడ్డకు జన్మనిచ్చారని ఆస్పత్రి వర్గాల ద్వారా సమాచారం తెలుసుకున్న రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జడ్జిని అభినందించారు. ఈ మేరకు మంగళవారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సామాన్య ప్రజలకు నమ్మకం కలిగేలా, ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ కావాలని జడ్జి నిర్ణయం తీసుకోవడాన్ని మంత్రి స్వాగతించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు నిష్ణాతులైన డాక్టర్లు, సిబ్బంది, మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

మూడు రోజులకు డిశ్చార్జి..

కొత్తగూడెం మాతాశిశు ఆస్పత్రిలో ఆదివారం ఆడబిడ్డకు జన్మనిచ్చిన జడ్జి టి.స్వప్న ఆపరేషన్ అయినప్పటికీ మూడు రోజులకు(మంగళవారం) డిశ్చార్జి అయి ఇంటికి చేరారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సహకారంతో తాను, తన కూతురుతో క్షేమంగా ఇంటికి వెళ్తున్నానని, ఆస్పత్రికి అవసరమైన ఇతర సౌకర్యాలపై కలెక్టర్‌కు నివేదిక ఇస్తానని తెలిపారు. వైద్య సిబ్బంది పనితీరు పట్ల జడ్జి సంతోషం వ్యక్తం చేశారు. ఆస్పత్రి అంటే పునర్జన్మ ఇచ్చే దేవాలయమని, వైద్యులు సాక్షాత్తు దేవుళ్లని అన్నారు.



కొత్తగూడెం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్తున్న జడ్జి స్వప్న

ప్రతి హామీ నెరవేరుస్తాం

- మరో రూ.2వేల కోట్లు ఖర్చయినా భరిస్తాం
- రైతులను అధికారులు ఇబ్బంది పెట్టొద్దు
- కొందరు కావాలనే అన్నదాతలను రెచ్చగొడుతున్నారు
- సమీక్ష సమావేశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి



వినాయకపురంలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన ఎంపీ రఘురాం రెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎమ్మెల్యే ఆదినారాయణ, ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు

అశ్వారావుపేట: తాము ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని, ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఐదు విజయవంతంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అశ్వారావుపేటలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో పోడు భూముల సర్వే విషయంలో అత్యుత్సాహం ప్రదర్శించవద్దని ఎఫ్‌డీఓ దామోదర్‌రెడ్డిని ఆదేశించారు. అటవీ శాఖకు చెందిన సెంటు భూమి కూడా రెవెన్యూ శాఖ తీసుకోదని స్పష్టం చేశారు. అశ్వారావుపేట, కొత్తగూడెం నియోజకవర్గాల్లో జాయింట్ సర్వే నిర్వహించి భూ వివాదాలు, పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్, ఆర్డీఓకు సూచించారు. రాష్ట్రంలో రూ.31 వేల కోట్లకు గాను రూ.19వేల కోట్ల మేర రైతులకు రుణమాఫీ చేశామని, ఇంకా ఎన్ని వేల కోట్లయినా రైతులకు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. అధికారులు రైతులను ఇబ్బంది పెట్టొదని ఆదేశించారు. ప్రతిపక్ష హోదా కూడా కోల్పోతామనే భయంతో కొన్ని రాజకీయ పార్టీలు రుణమాఫీపై రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా పేదల కోసం పనిచేసే ప్రభుత్వం తమదని, అర్హులందరికీ గృహజ్యోతి వర్తింపజేస్తామని, రూ.500కే గ్యాస్ ఇస్తున్నామని చెప్పారు.

పంచాయతీ, పీహెచ్‌సీ భవనాలు ప్రారంభం..

అశ్వారావుపేటరూరల్/ములకలపల్లి : అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం, నారాయణపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం సున్నంబట్టి ఐటీడీఏ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. హాస్టల్‌లో ఉన్న బియ్యం, కూరగాయలతోపాటు పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన బోధనతోపాటు నాణ్యమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కష్టపడితేనే భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో ఉంటారని, బాగా చదివి కలెక్టర్, ఎస్పీ కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. 'హాస్టల్‌లో 110 మంది విద్యార్థులుంటే చిన్న గిన్నెలో గుగ్గిళ్లు ఉడక పెడుతున్నారు.. అవి మీకు సరిపోతాయా' అని ప్రశ్నించడంతో పిల్లలంతా ఒక్కసారిగా నవ్వారు. చికెన్ పెడుతున్నారా..భోజనం రుచికరంగా ఉందా.? ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉన్నయా అంటూ మంత్రితో పాటు ఎంపీ రఘురాంరెడ్డి ఆరా తీశారు. హాస్టల్‌లో సరిపడా పరుపులు, బెడ్‌షీట్లు లేవని విద్యార్థులు మంత్రి దృష్టికి తెచ్చారు. తమకు బంగాళాదుంప కూర కావాలని కోరగా, ఈ సమస్యలన్నీ తప్పక పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

రోగులకు అసౌకర్యం కలిగించొద్దు

ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు అసౌకర్యం కలిగించొద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ములకలపల్లిలో రూ.1.50 కోట్లతో నిర్మించిన మంగపేట పీహెచ్‌సీ భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్యులు దేవుళ్లతో సమానమని, వైద్య వృత్తికి కళంకం తేకుండా పని చేయాలని అన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పీహెచ్‌సీలో అవసరమైన వైద్య పరికరాలు, మందుల నివేదికను సత్వరమే అందజేయాలన్నారు. పీహెచ్‌సీ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పీఆర్ ఈఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. తొలుత పీహెచ్‌సీ ఆవరణలో మొక్క నాటారు. ఆయా కార్యక్రమాల్లో నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కొత్తగూడెం ఆర్డీఓ మధు, డీఆర్డీఓ ఎం.విద్యాచందన, డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, డీసీహెచ్‌ఎస్ రవిబాబు, ఇరిగేషన్ ఈఈ సురేష్ కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, ఏపీడీ నల్లబోతుల రవి, డీఎల్‌పీఓ రమణరావు, ట్రాన్స్‌కో ఏడీఈ లక్ష్మణ్, నాయకులు ఊకంటి గోపాల్‌రావు, జూపల్లి రమేష్, తుమ్మా రాంబాబు, గాడి తిరుపతిరెడ్డి, తాండ్ర ప్రభాకర్‌రావు, బత్తుల అంజి, జూపల్లి ప్రమోద్, మొగళ్లపు చెన్నకేశవరావు, జ్యేష్ట సత్యనారాయణ, సుంకవల్లి వీరభద్రరావు, ఆకుల శ్రీను, నరాల శ్రీను, నులకాని శ్రీను, మిండా హరి, అనుమల సత్యనారాయణ, కారం సుధీర్, మడకం చిరుమప్ప పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట..

తమ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేస్తోందని మంత్రి పొంగులేటి అన్నారు. పేదలకు మేలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో శానిటేషన్, బ్లీచింగ్, 15వ ఆర్థిక సంఘం నిధులు, వినియోగంపై డీపీఓ చంద్రమౌళిని ప్రశ్నించగా ఆయన సరైన సమాధానం చెప్పకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, అవసరమైనంత మేర బ్లీచింగ్ నిల్వలు ఉంచాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు.



సున్నంబట్టి ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి, ఎంపీ తదితరులు

పంటలకు ప్రతికూలమే..

- భిన్న వాతావరణ పరిస్థితులతో ఇక్కట్లు
- ఉక్కపోతతో రైతులు, కూలీల ఉక్కిరిబిక్కిరి
- వరి, పత్తి పంటలను ఆశిస్తున్న చీడపీడలు, దోమపోటు
- ఆదిలోనే రైతులకు ఆటంకం



పత్తి చేనులో పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

బూర్గంపాడు: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వానాకాలంలోనూ ఎండాకాలాన్ని తలపిస్తున్నాయి. ఆగస్టు మొదటి వారం వరకు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసినా.. గత 15 రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. దీంతోపాటు విపరీతమైన ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఎండలు, ఉక్కపోతతో పొలం పనులు చేసే రైతులు, కూలీలు అనారోగ్యానికి గురవుతున్నారు. పొలాల్లో పనులు చేస్తుంటే విపరీతంగా చెమటలు పట్టడం, దాహం వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఇక పంటలకు సైతం ప్రతికూల పరిస్థితులే ఎదురవుతున్నాయి. భిన్న వాతావరణంతో చీడపీడలు ఆశిస్తున్నాయి. జూలైలో నెల రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పత్తి మొక్కలు ఎర్రబారి ఎదుగుదల లేకుండా ఉన్నాయి. ఇప్పుడు వర్షాలు ఆగిపోయి ఎండలు, ఉక్కపోత పెరగడంతో తెల్లదోమ, పచ్చదోమ ఉధృతి పెరిగింది. 50 – 60 రోజుల పత్తి మొక్కలకు తెగుళ్లు ఆశిస్తుండడంతో పురుగుమందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. సస్యరక్షణ చర్యలు చేపట్టిన పెద్దగా ప్రయోజనం ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. భిన్నమైన వాతావరణ పరిస్థితులే ఇందుకు కారణమని అంటున్నారు. వరిపైరును కూడా కాండం తొలుచు పురుగు, మొవి పురుగు, దోమలు నష్టపరుస్తున్నాయి. పంట తొలినాళ్లలోనే దెబ్బ తింటుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి నుంచే పురుగు మందులు పిచికారీ చేయాలంటే పెట్టుబడి ఖర్చులు భారీగా పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2.10 లక్షల ఎకరాల్లో పత్తి..

జిల్లాలో ఇప్పటివరకు సుమారు 2.10 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. 1.65 లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు. మరో 30 వేల ఎకరాల్లో మొక్కజొన్న, అపరాలు, కూరగాయల పంటలు సాగు చేశారు. పంటల ఎదుగుదల సమయంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఆగస్టులో కూడా మే నెలను తలపించేలా ఉన్న ఉక్కపోత, ఎండల తీవ్రత పంటలపై ప్రభావం చూపుతున్నాయి. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉండడంతో మనుషులు, జంతువులు అనారోగ్యానికి గురి కావడంతో పాటు పంటలకు సైతం దెబ్బేనని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మొక్కలు కూడా భూమి నుంచి సరిగా పోషకాలను గ్రహించలేక ఎదుగుదల లోపిస్తాయి. ఈ తరుణంలో పురుగు, దోమ ఉధృతి పెరిగిపోతుంది. వీటిని తట్టుకునే శక్తి మొక్కలలో ఉండటకపోవడంతో పంటలు దెబ్బతింటాయి. దీంతో రైతులు సస్యరక్షణ చర్యలపై దృష్టి పెట్టారు.

చేలలో పని చేయలేకపోతున్నాం

ఎండలు, ఉక్కపోతతో పొలంలో పనులు చేయలేకపోతున్నాం. కూలీలు కూడా మధ్యాహ్నానికే ఇంటి దారి పడుతున్నారు. ఎండల తీవ్రత, ఉక్కపోతతో వాంతులు, జ్వరాలు వస్తున్నాయి. పంటలు కూడా ఈ వాతావరణానికి దెబ్బతింటున్నాయి.

– నిమ్మల రాములు, రైతు

చీడపీడలు పెరుగుతున్నాయి

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటల్లో చీడపీడలు పెరుగుతున్నాయి. తొలినాళ్ల నుంచే మందులు పిచికారీ చేయాలంటే పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతాయి. మందులు కొట్టకపోతే దిగుబడి తగ్గుతుంది. కూలీలు కూడా ఎండలకు భయపడి మందులు కొట్టేందుకు రావడం లేదు.

– పునుగుపాటి కృష్ణ, రైతు

జాగ్రత్తలు వహించాలి

ఎండ ప్రభావం, ఉక్కపోత ఎక్కువగా ఉన్నాయి. ఈ తరుణంలో రైతులు, కూలీలు పొలం పనుల్లో జాగ్రత్తలు పాటించాలి. ఎండ బాగా ఉన్నప్పుడు పనులు నిలిపివేసి ఉదయం, సాయంత్రం చేసుకోవడం మంచిది. ఈ వాతావరణంతో పంటల్లోనూ చీడపీడలు పెరుగుతున్నాయి.

– బి.తాతారావు, ఏడీఏ, మణుగూరు

గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయుల బదిలీలు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 528 మంది ఉపాధ్యాయులను బదిలీ చేస్తూ డీడీ మణెమ్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో తెలుగు, హిందీ పండిట్‌లు, పీఈటీలు, ఎస్‌జీటీలు ఉన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు.. వారికి కేటాయించి స్థానాలలో సాధ్యమైనంత త్వరగా చేరాలని ఆమె ఆదేశించారు.



క్లుప్తంగా

విద్యార్థులతో రక్త నమూనాల సేకరణ

ఎంసీహెచ్‌లో కొరవడిన పర్యవేక్షణ

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా కేంద్రంలోని మాత శిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్)లో పర్యవేక్షణ లోపించింది. రక్త నమూనాలు నర్సింగ్ సిబ్బంది సేకరించాల్సి ఉండగా, ట్రైనింగ్ విద్యార్థులతో సేకరింపజేస్తున్నారని రోగులు ఆవేదన చెందుతున్నారు. విద్యార్థులకు పూర్తి అవగాహనలేక చిన్న పిల్లలకు నరాల కోసం వెతికే క్రమంలో రెండుమూడు సార్లు సూదులు గుచ్చుతున్నారని వాపోతున్నారు. మంగళవారం ఎంసీహెచ్‌లో రక్త నమూనాలు సేకరించే క్రమంలో ఐదేళ్ల బాబు కళ్లు తిరిగి పడిపోయాడని, మరో బాలుడికి గుచ్చిన సూది వంకర కావటంతో విలవిల్లాడని పేర్కొన్నారు. ఆస్పత్రి ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

గ్రేడ్‌-1 ప్రిన్సిపాల్‌గా పదోన్నతి


ప్రవంతి

బోనకల్: మండలంలోని ముష్టికుంట్లకు చెందిన బోళ్ల ప్రవంతి గ్రేడ్‌-1 పిన్సిపాల్‌గా పదోన్నతి సాధించింది. 2019 గురుకుల నోటిఫికేషన్‌లో ఆమె టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్‌గా ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించింది. అనంతరం మెదక్ జిల్లా కొడిపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకులంలో చరిత్ర విభాగం జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ప్రస్తుతం ఆమెకు గ్రేడ్‌-1 ప్రిన్సిపాల్‌గా ఉద్యోగోన్నతి దక్కడం గ్రామస్తులు పలువురు అభినందించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన హార్వెస్టర్

తప్పిన పెను ప్రమాదం


ఘటనాస్థలంలో ఆర్టీసీ బస్సు, హార్వెస్టర్

కొణిజర్ల: పెసరకాయలు కోయడానికి వచ్చిన హార్వెస్టర్ ఆర్టీసీ బస్సును వెనక నుంచి ఢీకొట్టిన ఘటన కొణిజర్ల సమీపాన ఎన్నెస్పీ కాల్వ వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ గుగులోత్ సూరజ్ తెలిపిన వివరాలు.. మధిర నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు కొణిజర్ల ఎన్నెస్పీ కాల్వ వద్దకు చేరుకోగానే కాల్వ కరకట్ట పైనుంచి వచ్చిన హార్వెస్టర్ వెనక భాగంలో ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి పక్కకు తప్పించడంతో ప్రమాదం తప్పినట్లయింది. ఒకవేళ హార్వెస్టర్ నేరుగా బస్సును ఢీకొడితే ప్రయాణికులకు ముప్పు వాటిల్లే అవకాశం ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా సిబ్బందితో చేరుకున్న రాకపోకలను క్రమబద్ధీకరించారు.

డెంగీ జ్వరంతో బాలుడి మృతి

పాల్వంచ: డెంగ్యూ జ్వరంతో ఐదేళ్ల బాలుడు మంగళవారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని వెంగళరావు కాలనీకి చెందిన కేటీపీఎస్ ఆర్టిజన్ కుమారుడు అదే కాలనీలోని స్కూల్‌లో 1వ తరగతి చదువుతున్నాడు. గత వారం రోజులుగా జ్వరం వస్తుండటంతో స్థానిక ఆర్‌ఎంపీకి చూపించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి డెంగీ జ్వరంగా నిర్ధారించారు. ఆ తర్వాత ఖమ్మం, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రాచన్నగూడేనికి చెందిన సింగలదేవి సత్యనారాయణ (65) ఈనెల 12న ద్విచక్రవాహనంపై రాజమండ్రి వెళ్లాడు. అదే రోజు రాత్రి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తున్న క్రమంలో అశ్వారావుపేట మండలం రామన్నగూడెం వద్ద ఎదురుగా వచ్చిన మినీ వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడగా, రాజమండ్రిలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తెగిపడ్డ విద్యుత్ తీగలు



టేకులపల్లి: మండలంలోని బిల్లుడు తండాలో మంగళవారం రాత్రి 11కేవీ విద్యుత్ తీగలు పడ్డాయి. గ్రామ సెంటర్‌లోని బాణోతు వెంకట్రాం అనే వ్యక్తి ఇంటి ముందు 11 కేవీ విద్యుత్ తీగలు తెగిపడగా, నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అక్కడేఉన్న పలువురికి త్రుటిలో ప్రమాదం తప్పింది. దశాబ్దాల కాలం నాటివి కావడంతోనే తీగలు తెగిపోయాయని మాజీ ఎంపీటీసీ భూక్య శంకర్‌నాయక్ పేర్కొన్నాడు. గత నెల 31న రాత్రి కూడా అదే గ్రామంలో అదే లైన్ తీగలు తెగిపడి భూక్య శ్రీను మృతి చెందాడు.

పశువైద్యం అంతంత మాత్రమే..!

- శిథిల భవనాల్లో పశువైద్య ఉప కేంద్రాలు
- పశు సంవర్థక శాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత
- పశువులకు వైద్యం అందక రైతుల అవస్థలు


పాండురంగాపురంలో శిథిలావస్థకు చేరిన పశువైద్య ఉపకేంద్రం

పాల్వంచరూరల్: ఏళ్ల తరబడి పశువైద్యశాలలు శిథిలమైన భవనాల్లోనే కొనసాగుతున్నాయి. పశు సంవర్థక శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. ఫలితంగా పశువులకు సరైన వైద్యం అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో మొత్తం 80 పశువైద్యశాలలు ఉన్నాయి. వీటిలో పాల్వంచ, కొత్తగూడెం, బూర్గంపాడు, భద్రాచలం, అశ్వారావుపేట, ఇల్లెందు ప్రాంతాల్లో ఆరు ప్రాంతీయ పశువైద్యశాలలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా మరో 30 ప్రాథమిక పశువైద్యశాలలు, 44 ప్రాథమిక ఉప పశువైద్యశాలలు ఉన్నాయి. వీటిలో ఎక్కువ సంఖ్యలో ఆస్పత్రులు కాలం చెల్లిన భవనాల్లో కొనసాగుతుండగా, ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. కాగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 5 లక్షల పశువులు ఉన్నాయి. వీటిలో 2,69,256 గొర్రెలు, 2,58,909 మేకలు, 1,176, పెరటికోళ్లు, 95,562 వాణిజ్యకోళ్లు ఉన్నట్లు పశుసంవర్థక శాఖ లెక్కలు చెబుతున్నాయి.

కొత్త భవనాలు అవసరమైన పశువైద్యశాలలు

జిల్లాలో శిథిలమైన పశు వైద్యశాలల్లో కేవలం నాలుగింటికి మాత్రమే గతంలో నిధులు మంజూరు చేశారు. గట్టుగూడెం, మొద్దులగూడెం, నాచారం, గుండెపూడి, కొమ్ముగూడెం, సంగం, పాండురంగాపురం, అన్నపురెడ్డిపల్లి, భూపతిరావుపేట, ముత్యాలంపాడు పశువైద్యశాలలు పాత భవనాల్లో నిర్వహిస్తున్నారు. వీటికి కొత్త భవనాలు నిర్మించాల్సి ఉంది. వినాయకపురం, బూర్గంపాడు, సుజాతనగర్, మాచారం, ఎర్రగుంట, రాజాపురం, పెనుగడప, రామవరం, మైలారం, నర్సాపురం పశువైద్యశాలలకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

ఏళ్ల తరబడి ఖాళీలు

జిల్లాలో ప్రాథమిక పశువైద్యకేంద్రాలు 30 ఉండగా, వీటిలో 18మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇంకా 12పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జూనియర్ వెంటర్నరీ ఆఫీసర్ పోస్టు, వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ పోస్టు ఒక్కోటి చొప్పున ఖాళీగా ఉన్నాయి. లైవ్ స్టాక్ అసిస్టెంట్ పోస్టులు మొత్తం 24 ఉండగా, ప్రస్తుతం 14మంది ఉన్నారు. మరో పది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అటెండర్ పోస్టులు మొత్తం 77 కాగా ఇందులో 41మంది ఉన్నారు. ఇంకా 36 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 44 ప్రాథమిక పశు ఆరోగ్య ఉపకేంద్రాల్లో 13 బీఎల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పలుచోట్ల పశు వైద్యాధికారులు పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. పాల్వంచ మండలం నాగారం గ్రామంలోని పశు వైద్యశాలలో రెండేళ్లుగా బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన డాక్టర్ బాలకృష్ణ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చర్ల, దుమ్ముగూడెం, సారపాక, బంజర, యానంబైల్ ఆస్పత్రుల అదనపు బాధ్యతలను కూడా ఇతనికే అప్పగించారు.


కులిపోయే స్థితిలో ఉన్న సంగంలోని పశు ఆరోగ్య ఉపకేంద్రం

ప్రతిపాదనలు పంపించాం



జిల్లాలో శిథిలమైన పశువైద్యశాలలతోపాటు అరకొర గదులతో ఉన్న ఆస్పత్రులకు పక్కా భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం.

– డాక్టర్ పురంధర్, జిల్లా పశువైద్యాధికారి

కొత్త భవనాలు నిర్మించాలి



పాల్వంచ మండలం పాండురంగాపురం, సంగం గ్రామాల్లో పశువైద్య ఉప కేంద్రాల భవనాలు కూలిపోయే స్థితిలో ఉన్నాయి. సిబ్బంది విధులు నిర్వహించాలంటే భయపడుతున్నారు. అధికారులు స్పందించి నూతన భవనాలు నిర్మించాలి.

– కె.రామారావు, రైతు, పాండురంగాపురం

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి



పశువైద్యశాఖలో డాక్టర్లు, సిబ్బంది పోస్టులు అనేక సంవత్సరాలుగా ఖాళీగా ఉన్నాయి. రైతులు ప్రతి సంవత్సరం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి.

– రాము, సంగం, పాల్వంచ మండలం

ప్రేమికులను కబళించిన మృత్యువు

ట్రాక్టర్ బోల్తా పడటంతో ప్రమాదం


ప్రసాద్ (ఫైల్)


నాగమణి (ఫైల్)

ములకలపల్లి: ఇద్దరూ ప్రేమించుకున్నారు. పెద్దలు కూడా అంగీకరించడంతో వచ్చే వేసవిలో వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. కానీ మృత్యువు వారిని రోడ్డు ప్రమాద రూపంలో కబళించింది. మండల పరిధిలోని వీకే రామవరం శివారులో సోమవారం అర్ధరాత్రి ట్రాక్టర్ బోల్తా పడి యువతి, యువకుడు మృతి చెందిన విషయం విదితమే. అశ్వాపురం మండలం తుమ్మలచెరువు గ్రామానికి చెందిన తాటి ప్రసాద్ (25) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బీఏ బీపీడీ చదువుకున్న ప్రసాద్‌కు సొంత ట్రాక్టర్ కూడా ఉంది. పాల్వంచలో తనతోపాటు చదువుకున్న కమలాపురం గ్రామానికి చెందిన పత్రి నాగమణి(25)ని ప్రేమించాడు. వీరి వివాహానికి పెద్దలు అంగీకరించారు. వచ్చే వేసవిలో పెళ్లి చేసేందుకు నిశ్చయించారు. ఈ క్రమంలో ప్రసాద్ కమలాపురంలో నాగమణి ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయం చేస్తున్నాడు. సోమవారం రాత్రి ప్రసాద్ తన ట్రాక్టర్‌పై ఇంటికి బయల్దేరాడు. రాత్రి వేళ వెళ్లొద్దని నాగమణి వారించినా వినకపోవడంతో ఆమె కూడా అతనితో ట్రాక్టర్‌పై బయలు దేరింది.

వర్షంతో వెనుదిరిగారు..

ఇద్దరూ తుమ్మలచెరువు వెళుతున్న క్రమంలో మార్గమధ్యలో వర్షం రావడంతో కొంతదూరం వెళ్లి, వెనక్కిమళ్లారు. తిరిగి కమలాపురం వస్తుండగా వీకే రామవరం సమీపంలోకి రాగానే రోడ్డు పక్కనే ఉన్న గోతిని తప్పించే క్రమంలో ట్రాక్టర్ పత్తి చేలో బోల్తా పడింది. వారిపై ట్రాక్టర్ ఇంజన్ పడిపోవడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

మృత శిశువు ఘటనపై విచారణ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గోదావరి మధ్య రాళ్లలో మృతశిశువు లభించిన ఘటనపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు. మంగళవారం సీఐ సంజీవరావు, పోలీస్ సిబ్బంది బోటులో వెళ్లి శిశువు దొరికిన ప్రదేశాన్ని మరోసారి పరిశీలించారు. తనకు అబార్షన్ చేసి శిశువును తొలగించారని ఓ యువతి ఆరోపిస్తున్న వీడియో సోమవారం వైరల్‌గా మారిన విషయం విదితమే. మృతశిశువును ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు తనకు అప్పగించగా, గోదావరి మధ్యలో పూడ్చి పెట్టినట్లు పంచాయతీ కార్మికుడు తెలిపాడని పోలీసులు పేర్కొంటున్నారు. ఆ ప్రదేశానికి వెళ్లి చూడగా అక్కడ గోదావరి వరద నీరు ఉంది. వరద ప్రవాహం ఉన్నప్పటికీ ఎలా పూడ్చిపెట్టావంటూ సీఐ ప్రశ్నించగా, పంచాయతీ కార్మికుడు మళ్లీ అదే సమాధానం చెప్పినట్లు తెలిసింది. కాగా గోదావరి కరకట్ట ప్రాంతంలోని సీసీ కెమెరాల పుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. అయితే పంచాయతీ కార్మికుడు పూడ్చిపెట్టిన శిశువు, యువతి ఆరోపిస్తున్న ఘటనలోని శిశువు ఒక్కటేనా? వేర్వేరా అనేది స్పష్టత రావాల్సి ఉంది.

పశువులు స్వాధీనం

ఇల్లెందు: ఇల్లెందు మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్న 18 పశువులను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. కొత్తగూడెం నుంచి తరలిస్తుండగా లలితాపురం చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏపీలో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు గ్రామానికి చెందిన వెంకటేష్, సుబ్రమణ్యం, నాగమల్లేశ్వరరావులపై కేసు నమోదు చేసినట్లు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు. పశువులను పాల్వంచ కబేళాకు తరలించారు.

మరణంలోనూ వీడని బంధం

- రోడ్డు ప్రమాదంలో కవల సోదరుల మృతి
- బైక్‌ను ట్రాలీ ఆటో ఢీకొట్టడంతో ఘటన


మహేష్ (ఫైల్)


నవీన్ (ఫైల్)

ఖమ్మంరూరల్: తల్లి గర్భం నుంచి సెకన్ల తేడాతో లోకంలోకి వచ్చిన వారిద్దరూ కలిసే పెరిగారు. ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న వారిని మృత్యువు ఒకేసారి బలి తీసుకుంది. ఈ విషాద ఘటన ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి సమీపాన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... ఖమ్మం రూరల్ మండలం దానవాయిగూడెంకు చెందిన అత్తులూరి నర్సింహారావు, రమాదేవి దంపతులకు మహేష్, నవీన్(22) కవల కుమారులు ఉన్నారు. వీరు డిగ్రీ పూర్తిచేయగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఖమ్మంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్నారు. మంగళవారం సాయంత్రం సోదరులిద్దరూ బైక్‌పై స్నేహితుడైన భద్రాద్రి జిల్లా సుజాతనగర్‌కు చెందిన పవన్‌తో కలిసి తమ అమ్మమ్మ ఊరైన కూసుమంచి మండలం పెరికసింగారం బయలుదేరారు. మార్గమధ్యలో మద్దులపల్లి వద్ద ట్రాలీ ఆటో వీరి ద్విచక్రవాహనాన్ని వెనుక నుండి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కవల సోదరులు మహేష్, నవీన్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా పవన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాగా, అమ్మమ్మ దగ్గరకు వెళ్తున్నామని చెప్పి బయలుదేరిన మహేష్, నవీన్ మృతి చెందారని తెలియడంతో స్వగ్రామమైన దానవాయిగూడెంతో పాటు అమ్మమ్మ ఊరైన పెరికసింగారంలో విషాదఛాయలు అలుముకుంది. కలిసి జన్మించిన కుమారులు కలిసే పెరిగి కుటుంబానికి అండగా నిలుస్తారని భావిస్తున్న తరుణంలో ఒకేసారి కన్ను మూయడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రెక్కల కష్టంతో కుమారులిద్దరిని చదివించామని, ఉద్యోగాలు సాధించేందుకు శిక్షణ పొందుతుండగా ఇలా జరగడంతో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరుతో అంతా కంటతడి పెట్టారు. ఈమేరకు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

ఆర్టీసీ బస్సు, ట్రాక్టర్ ఢీ

ములకలపల్లి: ఆర్టీసీ బస్సు, ట్రాక్టర్ ఢీ కొన్న సంఘటన మంగళవారం జరిగింది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో పెనుప్రమాదం తప్పింది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, మూకమామిడి గ్రామానికి 50 మంది ప్రయాణికులతో వెళుతోంది. ఈ క్రమంలో సాయిరాంపురం శివారులో మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సు కుడివైపు భాగం దెబ్బతిన్నది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. బస్ డ్రైవర్ సైదులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.


పేకాట రాయుళ్ల అరెస్ట్

పినపాక: పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పేకాట స్థావరంపై దాడి చేసి రూ. 6,100 నగదు, 8 బైక్‌లు, 7 సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. మరో ఏడుగురు నిందితులు పారిపోయారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు.

నాలుగు ఫ్యాన్లు చోరీ

మణుగూరు రూరల్: మండలంలోని తిర్లాపురం రైతు వేదికలో నాలుగు ఫ్యాన్లను సోమవారం రాత్రి చోరీ చేశారు. మంగళవారం వేదిక వద్దకు వెళ్లిన రామానుజవరం ఏఈఓ హారిక చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ విషయమై ఏఈఓ హారికను వివరణ కోరగా.. ఫ్యాన్లు చోరీ జరిగింది వాస్తవేమనని, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్య


ప్రసాద్ (ఫైల్)

జూలూరుపాడు: సాగు అవసరాలకు చేతిలో చిల్లిగవ్వ లేక ఆవేదనతో ఓ కౌలు రైతు సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని శంభునిగూడెంకు చెందిన వగ్గెల ప్రసాద్(36) ఈ ఏడాది ఐదెకరాల భూమి కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. కౌలు నగదు కొంత చెల్లించాడు. విత్తనాలు, ఇతర అవసరాలకు చేతిలో ఉన్న నగదు ఖర్చయింది. మందులు, ఇతరత్రా ఖర్చులకు చిల్లిగవ్వ లేకుండా పోయింది. దీంతో అప్పు కోసం ఎక్కడా ప్రయత్నించినా ఫలితం కానరాలేదు. దీంతో పంట చేజారిపోతుందనే మనస్తాపంతో సోమవారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లగా, కుటుంబీకులు గమనించి కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య ఉషారాణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రసాద్ స్వగ్రామం పెనుబల్లి కాగా శంభునిగూడెం ఇల్లరికం వచ్చి అత్తగారింట్లో ఉంటున్నాడు.

లైంగిక దాడిపై మహిళ ఫిర్యాదు

విచారణ పూర్తయ్యాక వివరాలు వెల్లడిస్తాం: సీఐ

ఖమ్మంఅర్బన్: కూలీ పని ఉందని చెప్పి తీసుకెళ్లిన మహిళ బలవంతంతో మరో వ్యక్తి తనపై లైంగిక దాడి చేశాడని ఓ మహిళ ఖమ్మం అర్బన్ (ఖానాపురం హవేలీ) పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుకు సంబంధించి సీఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాలు... భర్తతో విడిపోయిన 42ఏళ్ల మహిళ కుమార్తెతో కలిసి ఖమ్మం పాండురంగపురంలో అద్దె ఇంట్లో జీవిస్తోంది. కూలీ పనులకు వెళ్లి పొట్టపోసుకుంటున్న ఆమెను అదే ఇంటి మరో పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న మహిళ ఈనెల 12న ముదిగొండ మండలం పెద్ద మండవలో పని ఉందని చెప్పడంతో బాధిత మహిళ జెడ్పీ సెంటర్‌కు వెళ్లింది. అక్కడ ఓ వ్యక్తి వచ్చి బైక్‌పై ఇద్దరిని తీసుకెళ్తూ బోనకల్ క్రాస్ నుంచి నామారం మీదుగా పెద్ద మండవ మార్గంలో వెళ్లాడు. మార్గమధ్యలో మద్యం కొనుగోలు చేయగా వారిద్దరూ తాగాక ఆ మహిళ తన రెండు చేతులు గట్టిగా పట్టుకుంటే బైక్‌పై తీసుకొచ్చిన వ్యక్తి లైంగిక దాడి చేశాడని బాధితురాలు ఆరోపిస్తోంది. అంతేకాక ఎవరికైనా చెబితే తనతో పాటు కుమార్తెను చంపేస్తామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొంది. మరుసటి రోజు తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో తన కుమార్తెతో కలిసి పక్క పోర్షన్‌లో ఉండే మహిళను ప్రశ్నించగా ఆమె భర్తతో కలిసి తమను చితకబాదారని, దీంతో ఈనెల 14న ఖానాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెబుతోంది. అయితే, ఆ రోజు ఫిర్యాదులో లైంగిక దాడి జరిగిన విషయాన్ని ప్రస్తావించకపోగా.. మంగళవారం బాధితురాలికి తీవ్ర కడుపునొప్పి, రక్తస్రావం అవుతోందని చెప్పడంతో ఎస్సై జ్యోతి, కానిస్టేబుల్‌తో కలిసి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా లైంగిక దాడి విషయం బయటపడినట్లు చెబుతున్నారు. ఈవిషయమై సీఐ భానుప్రకాష్‌ను వివరణ కోరగా బాధిత మహిళ రెండు సార్లు ఇచ్చిన ఫిర్యాదులో తేడాలు ఉన్నందున పూర్తి స్థాయి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

రుణమాఫీకి మళ్లీ దరఖాస్తు చేసుకోండి

డీసీఎంఎస్ చైర్మన్ శ్రీనివాసరావు


రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏఓ, డీసీఎంఎస్ చైర్మన్‌లు

పాల్వంచరూరల్: ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండి మూడు దఫాలుగా జరిగిన రుణమాఫీ కాని రైతులు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రైతు తన పట్టాపాసుపుస్తకం, రేషన్‌కార్డు విధిగా సమర్పించాలని, రూ. 2 లక్షల కంటే ఎక్కువ అప్పు ఉన్న రైతులు, మిగతా రుణం చెల్లిస్తే రూ.2 లక్షల రుణమాఫీ వర్తిస్తుందని వివరించారు. రుణమాఫీకాని రైతులు ఈనెల 30వరకు వ్యవసాయశాఖ అధికారికి దరఖాస్తు అందజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, ఎస్‌వీఆర్‌కే. ఆచార్యులు, కాపర్తి వెంకటాచారి, చింతా నాగరాజు, సుందర్‌రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదని 40 దరఖాస్తులు

వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా, రుణమాఫీకాని పలువురు రైతులు దరఖాస్తులు అందించారు. తమకు అర్హత ఉన్నప్పటికీ రుణమాఫీ కాలేదని పేర్కొంటూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు 40 మంది వ్యవసాయశాఖ అధికారి శంభోశంకర్‌కు దరఖాస్తులను అందజేశారు. దరఖాస్తులను స్వీకరించిన ఏఓ రైతుల ఆధార్ కార్డు నంబర్ల ఆధారంగా వైబ్‌సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేశారు. సమస్యను ఉన్నతాధికారులకు, బ్యాంకర్లకు పంపినట్లు ఏఓ తెలిపారు.

ఇద్దరు పిల్లలు.. ఒక టీచర్


ప్రాథమిక పాఠశాలలో టీచర్ పద్మ

టేకులపల్లి: మండలంలోని ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లో ఉన్న మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే విద్యనభ్యసిస్తున్నారు. ఒక్క టీచర్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో 2023 విద్యాసంవత్సరంలో ప్రారంభంలో 11 మంది విద్యార్థులు ఉన్నారు. కొందరు టీసీ తీసుకుని వెళ్లగా ప్రస్తుతం ఇద్దరే విద్యార్థులు చదువుతున్నారు. సోమవారం రాఖీ పండుగ కారణంగా మంగళవారం ఆ ఇద్దరూ పాఠశాలకు రాలేదు. కాగా ఇక్కడ మోతుకూరి పద్మ, హనుమంతు అనే ఇద్దరు టీచర్లు పని చేస్తున్నారు. హనుమంతు రెండేళ్ళ బీఈడీ కోర్సు కోసం ఓడీలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా హెచ్‌ఎం పద్మకు అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట ఉన్నత పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్ సోషల్ సబ్జెక్టు టీచర్‌గా పదోన్నతి లభించింది. జూన్‌లో వెళ్లి అక్కడ విధుల్లో చేరారు. అయితే ఓడీలో ఉన్న టీచర్ రాకపోవడంతో, ఆమెను తిరిగి డిప్యుటేషన్‌పై ఇదే పాఠశాలకు పంపించారు.

విద్యార్థులు వంద శాతం హాజరుకావాలి


హెచ్‌ఎంల సమీక్షలో మాట్లాడుతున్న ఖమ్మం డీఈఓ సోమశేఖరశర్మ

కారేపల్లి: పాఠశాలకు విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా హెచ్‌ఎంలు పర్యవేక్షించాలని, ఎవరైనా గైర్హాజరైతే వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడాలని ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ సూచించారు. కారేపల్లి మండలంలోని బొక్కలతండా, కారేపల్లి, సింగరేణి ప్రాథమిక పాఠశాలలు, గేటుకారేపల్లి, కారేపల్లి హైస్కూళ్లను మంగళవారం ఆయన తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించాక కారేపల్లి హైస్కూల్‌లో హెచ్‌ఎంలతో సమావేశమయ్యారు. హైస్కూళ్లలో ఈనెల 21నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, మధ్యాహ్నం 3.30 గంటలకు డ్రిల్ పీరియడ్‌ను నిర్వహిస్తూ ఎక్కాలు, ఆంగ్ల పదాల పఠనం, పద్యాలు చెప్పించాలని డీఈఓ తెలిపారు. ఈ తనిఖీల్లో ప్లానింగ్ కోఆర్డినేటర్ సీహెచ్.రామకృష్ణ, ఎంఈఓ జయరాజు, కర్నాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో మూడు ఇళ్లల్లో చోరీ

రూ.12లక్షలకు పైగా సొత్తు అపహరణ


చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న ఏసీపీ రఘు

సత్తుపల్లిటౌన్: తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకున్న దుండగులు సత్తుపల్లిలోని మూడు ఇళ్లలో సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. గంగారం ప్రకాష్‌నగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు అఖిల పర్వీన్, గియాజ్ దంపతులు హనుమాన్‌నగర్‌లోని ఇంటికి తాళం వేసి సిద్ధారం రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న ఇంటి వద్ద ఉంటున్నారు. ఈక్రమంలో తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు పగులగొట్టి బీరువాలోని రూ.11.37 లక్షల విలువైన 158 గ్రాముల బంగారం, 90 తులాల వెండి ఆభరణాలే కాక రూ.25వేల నగదు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఇంటి తలుపులు తీసి ఉన్నా ఎవరూ లేకపోవడంతో స్థానికులు గమనించి చెప్పగా పర్వీన్, గియాజ్ వచ్చేసరికి చోరీ జరిగినట్లు తేలింది. అలాగే, హనుమాన్‌నగర్‌లోని ఆంజనేయస్వామి గుడి వెనుక వీధికి చెందిన సిద్ధారం లైన్‌మెన్ బానోత్ నాగేశ్వరరావు రాఖీ పండుగ కోసం ఇంటి తాళం వేసి ఊరు వెళ్లారు. ఆయన మంగళవారం వచ్చేసరికి తాళం తొలగించి ఇంట్లోని రూ.40వేల నగదు, రూ.24వేల విలువైన 26 తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఆ ఇంటి పక్కనే తాళం వేసి ఉన్న పొంద్రి వాసు ఇంట్లోనూ చొరబడిన దొంగలు రూ.7వేల నగదు, వెండి వస్తువులు చోరీ చేయగా సత్తుపల్లి ఏసీపీ ఎ.రఘు, ఇన్‌చార్జ్ ఎస్సై వీర ప్రసాద్‌తో పాటు ఖమ్మం నుంచి వచ్చిన క్లూస్ టీం సభ్యులు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.న్నారు.

పరదా కడితే.. పడదా?

- పెచ్చులు కిందపడకుండా పరదాలు కట్టిన వైనం
- పెనుగొండ జెడ్పీ పాఠశాలలో పిల్లల దుస్థితి



పెనుగొండ జెడ్పీ హైస్కూల్ స్లాబ్‌కు పరదాలు కట్టిన దృశ్యం.. చదువుకుంటున్న విద్యార్థులు



పెనుగొండ హైస్కూల్‌లోని గదిలోని పెచ్చులూడిన స్లాబ్

కేసముద్రం: తరగతి గదుల్లో స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్న ఓ బడిలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువు నెట్టుకొచ్చేస్తున్నారు. తాత్కాలికంగా పరదాలు కట్టి అడ్డు పెట్టినా ఒక్కోసారి పెద్ద పెద్ద పెచ్చులను పరదాలు కూడా ఆపలేకపోతున్నాయి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పిల్లల దుస్థితి మాత్రం మారలేదు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ జెడ్పీ హైస్కూల్‌లో 165 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 9 గదులకు గాను ఒక గది స్టోర్ రూం, మరో గది స్టాఫ్‌కు కేటాయించారు. పాఠశాలలో స్లాబ్ శిథిలావస్థకు చేరుకోవడంతో పెచ్చులు ఊడిపడుతూ, ఇనుప సలాక్‌లు కిందకు వేలాడుతున్నాయి. ఇలా నాలుగు తరగతి గదుల్లో పై పెచ్చులు పడుతుండటంతో వాటిని తప్పించుకునేందుకు పిల్లలు ప్రాణభయంతో బయటకు పరుగులు తీస్తున్నారు. ఇక వర్షం పడినప్పుడల్లా స్లాబ్ కురుస్తుండటం, దాంతో పాటు పెచ్చులు పడుతుండటంతో పిల్లలను పక్కనే ఉన్న డైనింగ్ హాల్‌లో కూర్చోబెడుతున్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి తెలిపారు.

కెమికల్ లోడ్ మాటున గంజాయి తరలింపు

- రూ 1.80 కోట్ల విలువైన సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్



దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్

దమ్మపేట: కెమికల్ లోడ్ మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న రూ 1.80 కోట్ల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు. దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఒడిశా నుంచి కెమికల్ లోడుతో మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాకు వెళ్తున్న డీసీఎం వ్యాన్‌ను దమ్మపేట మండలం అచ్యుతాపురం క్రాస్‌రోడ్డు వద్ద టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు తనిఖీ చేశారు. వాహనం కింద భాగంలో 247 ప్యాకెట్లలో తరలిస్తున్న 508 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నాసిక్ జిల్లాకు చెందిన 12 మంది ముఠాగా ఏర్పడి గంజాయి తరలిస్తున్నారని, అక్కడ చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి పుణె, ముంబై వంటి నగరాల్లో విక్రయిస్తుంటారని ఎస్పీ తెలిపారు. ఈ ముఠాలోని ఆరుగురిని అరెస్ట్ చేశామని, గంజాయి సరఫరా చేసిన కోరాపుట్ జిల్లాకు చెందిన శ్రీనుతోపాటు మిగతా ఆరుగురు పరారీలో ఉన్నారని చెప్పారు. గంజాయి తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించామని, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని పేర్కొన్నారు. గంజాయి నియంత్రణలో తెలంగాణలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, ఏడాది కాలంలో 62 కేసులు నమోదు చేసి రూ. 20 కోట్ల విలువైన 6,500 కిలోల గంజాయిని సీజ్ చేశామని వివరించారు. సమావేశంలో అశ్వారావుపేట సీఐ కరుణాకర్, టాస్క్‌ఫోర్స్ సీఐ బెల్లం సత్యనారాయణ, ఎస్సైలు సాయికిషోర్‌రెడ్డి, జలకం ప్రవీణ్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి భర్త.. ఉరేసుకుని భార్య ఆత్మహత్య

సంతానం లేకపోవడంతో దంపతుల మధ్య కలహాలు



మృతిచెందిన దంపతులు గురువయ్య, వెంకటమ్మ(ఫైల్)

బెల్లంపల్లి రూరల్: సంతానం కలుగకపోవడం ఆ దంపతుల మధ్య కలహాలకు కారణమైంది. ఘర్షణకు దారితీసి భార్యపై చేయి చేసుకోవడంతో ఆమె ఆస్పత్రి పాలైంది. దీంతో వేదనకు గురైన భర్త క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భర్తకు దూరమై జీవించలేక భార్య ఉరేసుకుని తనువు చాలించింది. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం బుధాకుర్దు గ్రామంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్, గ్రామస్తుల కథనం ప్రకారం.. బుధాకుర్దు గ్రామ పంచాయతీ పరిధి కాసిరెడ్డిపల్లెకు చెందిన గురువయ్యతో వెంకమ్మ అలియాస్ వెంకటమ్మకు ఇరవై ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కూలి పనులు చేసుకుంటూ వారు జీవనం సాగిస్తున్నారు. ఇన్నేళ్లయినా సంతానం కలుగకపోవడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు తలెత్తేవి. ఒక్కోసారి తీవ్ర ఘర్షణకు దారి తీసేవి. ఈ క్రమంలో గత ఆదివారం గురువయ్య తన భార్య వెంకటమ్మతో గొడవపడి ఆమెను తీవ్రంగా కొట్టడంతో ఆస్పత్రి పాలైంది. తన వల్లే భార్య ఆస్పత్రిపాలు కావడం, మరోవైపు తమకు సంతానం కలగడం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన గురువయ్య అదే రోజు క్రిమి సంహారక మందు తాగాడు. బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి చనిపోయాడు. అంత్యక్రియలు పూర్తి చేసిన వెంకటమ్మ.. భర్త మరణాన్ని తట్టుకోలేక సోమవారం అర్ధరాత్రి ఇంటి ముందు ఉన్న చెట్టుకు చీరతో ఉరేసుకుంది. అందరితో కలివిడిగా ఉండే దంపతులు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కూతురి పెళ్లి డబ్బుల కోసం హత్య

- కల్లు సీసా ఆధారంగా కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ క్రైం: కూతురి పెళ్లి చేసేందుకు అవసరమైన డబ్బు కోసం పథకం ప్రకారం ఓ మహిళను మరో మహిళ హత్య చేసింది. ఘటనా స్థలంలో దొరికిన కల్లు సీసా ఆధారంగా విచారణ చేసిన పోలీసులు నిందితురాలిని పట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నవాబ్‌పేటకు చెందిన లక్ష్మమ్మ (48) కొడుకు, కోడలు హైదరాబాద్‌లో ఉండటంతో ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. నవాబ్‌పేటకు చెందిన పద్మమ్మకు లక్ష్మమ్మతో పాత పరిచయం ఉండటంతో ఇద్దరూ కలిసి నిత్యం కల్లు తాగేవారు. ఈ క్రమంలోనే పద్మమ్మ ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోవడంతో పాటు కూతురి పెళ్లికి డబ్బులు కావాల్సి వచ్చాయి. దీంతో ఎలాగైనా లక్ష్మమ్మను హత్య చేసి ఆమె దగ్గర ఉన్న బంగారం, వెండి తీసుకోవాలని పథకం వేసింది. ఏప్రిల్ 12న రాత్రి ఇద్దరూ కలిసి కల్లు తాగిన తర్వాత లక్ష్మమ్మ నిద్రపోతున్న సమయంలో పద్మమ్మ అర్ధరాత్రి సమయంలో రోకలిబండతో తలపై బాది హత్య చేసింది. ఆ తర్వాత ఆమె దగ్గర ఉన్న 30 తులాల వెండి, ఒక తులం బంగారం, సెల్‌ఫోన్ తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటనపై నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేయగా ఇంట్లో దొరికిన కల్లుసీసా ఆధారంతో పాటు టెక్నికల్ క్లూస్ సేకరించిన సాక్ష్యాలతో నిందితురాలిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. పద్మమ్మను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ చెప్పారు. సమావేశంలో రూరల్ సీఐ గాంధీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్సే కవితకు బెయిల్ ఇప్పిస్తోంది



ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో కేసీఆర్ కుమ్మక్కు: బండి సంజయ్

మహేశ్వరం: కేసీఆర్ కూతురు కవితకు కాంగ్రెస్ పార్టీయే బెయిల్ ఇప్పిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇందుకు సంబంధించిన కేసును కాంగ్రెస్ నుంచి కాబోయే రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సింఘ్వీయే కోర్టులో వాదిస్తున్నారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాలలో మంగళవారం నిర్వహించిన సూర్యగిరి రేణుక ఎల్లమ్మ ఉత్సవాలకు హాజరైన సంజయ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలతో కేసీఆర్ మ్యాచ్ ఫిక్సింగ్ చేస్తున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు. కేసీఆర్ సూచించిన వారికే రాష్ట్రంలో మంత్రి పదవులు, నామినేటెడ్ పోస్టులు, రాజ్యసభ సీట్లు వస్తున్నాయని తెలిపారు. ఈ విషయం తెలిసిన కాంగ్రెస్ నేతలు కేసీఆర్ ఫాంహౌస్‌కు క్యూ కడుతున్నారని వ్యాఖ్యానించారు. అభిషేక్ సింఘ్వీ అనుభవజ్ఞుడైన న్యాయవాది అని, ఆయన తెలంగాణ నుంచి ఎంపీ అయితే రాష్ట్ర ప్రయోజనాల కోసం కోర్టుల్లో, పార్లమెంట్‌లో గట్టిగా వాదిస్తారనుకుంటే .. లిక్కర్ కేసులో అరెస్టయి జైల్లో ఉన్న కవిత బెయిల్ కోసం వాదిస్తున్నారని ఎద్దేవా చేశారు.

చందాదారులెవరు?

▶ మొదటి పేజీ తరువాయి

దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టివేస్తూ ఉమ్మడి హైకోర్టు 2018 డిసెంబర్ 31న తీర్పునిచ్చింది. అయితే అనంతరం ఈ తీర్పును సవాల్ చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (వైఎస్సార్ సీపీ హయాంలో) సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేశాయి. మరోవైపు తీర్పులో కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మార్గదర్శి, రామోజీరావు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లు అన్నింటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం హైకోర్టు ఇచ్చిన తీర్పును 2024 ఏప్రిల్ 9న కొట్టివేసింది. హైకోర్టు తీర్పును తప్పుబడుతూ.. మార్గదర్శి డిపాజిట్ల సేకరణకు సంబంధించి వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందేనని స్పష్టం చేసింది. ఉండవల్లి, ఏపీ సర్కార్ సహా అందరి వాదనలు వినాలని పేర్కొంది.

మార్గదర్శి అక్రమాలను ఆర్బీఐ కౌంటర్‌లో తేల్చింది..: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో తెలంగాణ హైకోర్టు తాజాగా మరోసారి విచారణ ప్రారంభించింది. సీనియర్ జడ్జి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టాలన్న అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వాన్ని, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ని ప్రతివాదుల జాబితాలో చేర్చింది. గత విచారణ (ఈనెల 6వతేదీన) సందర్భంగా కౌంటర్ దాఖలుకు చివరి అవకాశం ఇవ్వాలన్న ఆర్‌బీఐ వినతికి అంగీకరిస్తూ ఇకపై ఈ పిటిషన్లను మోషన్ లిస్ట్‌లో పేర్కొనాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ క్రమంలో మార్గదర్శి ఫైనాన్షియర్స్ వసూలు చేసిన డిపాజిట్లన్నీ చట్టవిరుద్ధం, అక్రమమేనని, అందుకు బాధ్యులను ప్రాసిక్యూట్ చేయాలని నివేదిస్తూ ఈ నెల 13న ఆర్బీఐ తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. ఈ క్రమంలో మంగళవారం జస్టిస్ సుజోయ్‌పాల్ నేతృత్వంలోని ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, కోర్టు సహాయకులుగా మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. ఏపీ ప్రభుత్వ న్యాయవాదితోపాటు తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాది పల్లె నాగేశ్వర్‌రావు, ఆర్బీఐ న్యాయవాది కె.రతంగపాణిరెడ్డి హాజరయ్యారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారిస్తూ చట్టం 45 (ఎస్)ను ఉల్లంఘించినట్లు ఆర్బీఐ కౌంటర్‌లో తేల్చిందని ఈ సందర్భంగా ఉండవల్లి హైకోర్టు దృష్టికి తెచ్చారు. దీని ఆధారంగా మార్గదర్శిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని నివేదించారు. దాదాపు 70 వేల మంది చందాదారుల వివరాలను 1,500కిపైగా పేజీల్లో మార్గదర్శి సుప్రీం కోర్టుకు సమర్పించిందని, ఆ వివరాలను హైకోర్టుకు కూడా పెన్‌డ్రైవ్‌లో అందజేసేలా ఆదేశించాలని కోరారు. దీనిపై జస్టిస్ సుజోయ్‌పాల్ స్పందిస్తూ.. వివరాలు కోరుతూ ఓ అఫిడవిట్ దాఖలు చేయాలని, ఆ మేరకు ఆర్బీఐ, మార్గదర్శికి ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొంటూ తదుపరి విచారణను వాయిదా వేశారు.

అందరినీ అనుమతించాం

బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాఖీ పండుగ రోజున విద్యార్థినుల తల్లిదండ్రులు, సోదరులను గురుకులంలోనికి అనుమతించామని రాజన్న సిరిసిల్ల జిల్లా బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ చెప్పారు. మంగళవారం ఆమె కలెక్టర్‌కు వివరణ ఇస్తూ లేఖ రాశారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రుల రాక మొదలు కాగా, జోనల్ ఆఫీసర్ సూచనల మేరకు అనుమతించామన్నారు. మధ్యాహ్నం 1.40 గంటలకు ఒకేసారి ఎక్కువ మొత్తంలో విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చారని, చిన్న గేటు ద్వారా చెక్ చేస్తూ పంపించామని చెప్పారు. కాగా, కిటికీల ద్వారా రాఖీలు కట్టిన తమ పిల్లలను పాఠశాలలో ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందని, కాబట్టి జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపి విద్యార్థినులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లా వార్తలు

క్రీడాకారిణికి రూ.10వేల ఆర్థికసాయం



అభినయశ్రీకి నగదు అందజేస్తున్న విజేత

ఖమ్మంఅర్బన్: అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థినికి ఖమ్మం మహిళా ప్రాంగణం మేనేజర్ విజేత తమ ఫౌండేషన్ ద్వారా మంగళవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ముదిగొండ కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చల్లగొండ అభినయశ్రీ కరాటేలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి ఈనెల 30 నుంచి నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన అభినయశ్రీ నేపాల్ వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న విజేత తమ ఫౌండేషన్ ద్వారా ఆర్థికసాయం అందజేసి పోటీల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కోచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు జీఎం కార్యాలయం ప్రారంభం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే–7 ఓసీ విస్తరణలో భాగంగా నిర్మించిన ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం, వర్క్‌షాపులను ఈనెల 22న గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.శాలేంరాజు వెల్లడించారు. జీఎం కార్యాలయం, వర్క్‌షాప్‌లతో పాటు జగన్నాథపురం(చెరుకుపల్లి)లో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.9 కోట్లతో అభివృద్ధి చేసిన పాఠశాల, చర్చి, గుడి, కమ్యూనిటీ హాల్‌ను సైతం డిప్యూటీ సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పలువురు మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేతో పాటు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, అధికారులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి

మణుగూరు టౌన్: యాంత్రిక శక్తిని పూర్తిగా వినియోగించుకుంటూ బొగ్గు ఉత్పత్తి, రవాణాలో ఆటంకాలు ఎదురుకాకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వరరెడ్డి సూచించారు. మణుగూరు ఏరియాలో మంగళవారం పర్యటించిన ఆయన ఓసీ–2, 4 గనుల్లో అధికారులతో సమావేశమయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరం 126.5లక్షల టన్నుల మేర బొగ్గును ఉత్పత్తి చేసేలా కృషి చేయాలన్నారు. డైరెక్టర్ వెంట ఏరియా జీఎం దుర్గం రాంచందర్, పీఓ లక్ష్మీపతిగౌడ్, అధికారులు వెంకట్రావు, వీరభద్రుడు, సురేశ్ ఉన్నారు.

రైతుల పక్షాన పోరాటాలు చేస్తాం



అధికారులతో మాట్లాడుతున్న హరిప్రియ, నాయకులు

- పూర్తి స్థాయిలో రుణమాఫీ సాధనే బీఆర్ఎస్ లక్ష్యం
- ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ

టేకులపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ ఆధ్వర్యాన పోరాడుతూ రైతులకు మేలు జరిగే వరకు విశ్రమించేది లేదని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ స్పష్టం చేశారు. రుణమాఫీ సంపూర్ణంగా అమలుచేయాలనే డిమాండ్‌తో నాయకులతో కలిసి టేకులపల్లిలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాలంపాడు క్రాస్‌లోని రైతు వేదికలో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులతో ఆమె మాట్లాడారు. దరఖాస్తులను ఎప్పటిలోగా పరిష్కరించి రుణమాఫీ అమలుచేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈనెల 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విఫలమైందని ఆరోపించారు. ఈవిషయమై బీఆర్ఎస్ ప్రశ్నిస్తుండడం, రైతులు ఆందోళన చేస్తుండడంతో హడావుడిగా దరఖాస్తులు స్వీకరిస్తున్నప్పటికీ ఎప్పటిలోగా పరిష్కరిస్తారనే విషయమై అధికారుల వద్ద సమాధానం లేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రుణమాఫీ హామీ ఇచ్చి ఇప్పుడు షరతులు విధించడం సరికాదని హరిప్రియ తెలిపారు. వారం, పది రోజుల్లో ప్రక్రియ పూర్తి స్థాయిలో పూర్తికాకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యాన ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, నాయకులు మాలోతు శివనాయక్, బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలు, భూక్యా లాలునాయక్, బానోతు కిషన్, తేజావత్ రవి, బర్మావత్ శివ, కుమ్మరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



తాలిపేరుకు పోటెత్తిన వరద

భద్రాద్రి జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టులోకి భారీ వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రాజెక్టులోకి వరద మొదలైంది. దీంతో మంగళవారం ఉదయం ప్రాజెక్టు 25 గేట్లలో 12 గేట్లను రెండేసి అడుగుల మేర ఎత్తి 14,508 క్యూసెక్కుల చొప్పున వరదను దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా వరద ఉధృతి ఆధారంగా నీటిమట్టాన్ని 73.51 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నారు. – చర్ల

రూ.36.90లక్షలతో కమ్యూనిటీ హాల్

'సేవ్ భద్రాద్రి' ఆధ్వర్యాన ఈనెల 28న శంకుస్థాపన



మాట్లాడుతున్న సేవ్ భద్రాద్రి వ్యవస్థాపకుడు దుర్గాప్రసాద్

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో వివిధ అవసరాలకు ఉపయోగపడేలా సేవ్ భద్రాద్రి ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్లు వ్యవస్థాపకుడు పాకాల దుర్గాప్రసాద్ వెల్లడించారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. 2022లో గోదావరి వరదల సమయాన సంస్థను స్థాపించి రూ.36.90 లక్షల విరాళాలు సేకరించామని తెలిపారు. దాతలు ఇచ్చిన ఈ నగదు పదిమందికి ఉపయోగపడాలనే భావనతో పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద దేవాదాయ శాఖ స్థలంలో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిర్ణయించినట్లు చెప్పారు. వరదల వచ్చినప్పుడు ముంపు ప్రాంతాల ప్రజలకు ఆశ్రయం కల్పించడమే కాక కేంద్ర బలగాలు నివాసముండేలా ఈ హాల్ నిర్మించనున్నట్లు చెప్పారు. అంతేకాక పేద ప్రజలు కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కూడా ఉపయోగపడేలా ఈ హాల్ నిర్మాణానికి 28న శంకుస్థాపన చేస్తామని దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి చారుగుళ్ల శ్రీనివాస్‌తో పాటు ఎస్.కే.అజీమ్, పరిమి సోమశేఖర్, ముని కేశవ్, గాదె మాధవరెడ్డి, శ్రీనివాస్, పామరాజు తిరుమలరావు, బాలనర్సారెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు ఉత్తరం రాద్దాం!



ఉత్తరాలతో పాఠశాల విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: కుటుంబ పెద్దలను గౌరవించడం.. వారితో మంచీచెడు పంచుకునేలా పిల్లల్లో అవగాహన కల్పించేందుకు ఖమ్మంలోని మోమినాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. పత్తిపాక ఫౌండేషన్, గరిపల్లి ట్రస్ట్ ప్రోత్సాహంతో చొక్కాపు వెంకటరమణ సారథ్యాన అవ్వాతాతలకు ఉత్తరాలు రాసే కార్యక్రమం నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు సయ్యద్ షఫీ కన్వీనర్‌గా వ్యవహరించగా 50 మంది విద్యార్థులు తమ అవ్వాతాతలకు లేఖలు రాసి కవర్లలో పెట్టి పోస్ట్ చేశారు. ఈ కార్యక్రమంతో బంధాలు, ప్రేమానురాగాల విలువ తెలుస్తుందని హెచ్‌ఎం ఎం.జానకి అన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. రాష్ట్రంలో తొలి విడతగా 80 పాఠశాలల్లో ఈ కార్యక్రమం చేపట్టగా ఖమ్మం జిల్లా నుండి మోమినాన్ పాఠశాలలో నిర్వహించారు.

కొవ్వూరు రైల్వేలైన్‌కు నిధులు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగాచార్యులు

కొత్తగూడెంఅర్బన్: కొవ్వూరు రైల్వే లైన్‌కు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ కన్వీనర్ కొదమసింహ పాండురంగాచార్యులు డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కొవ్వూరు రైల్వేలైన్‌కు నిధులు మంజూరు చేసేలా తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు కేంద్రానికి లేఖ ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఇరు రాష్ట్రాల సీఎంలు చొరవ చూపితే తప్ప ఫలితం ఉండదని తెలిపారు. కొవ్వూరు రైల్వేలైన్‌ను 2014లో మంజూరైందని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికే మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కలిసి విషయాన్ని సీఎంల దృష్టికి తీసుకెళ్లాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ లైన్‌కు నిధులు కేటాయించడంతో పాటు కొత్తగూడెం నుంచి తిరుపతి, షిర్డీకి రైళ్ల ఏర్పాటు, గతంలో రద్దు చేసిన రైళ్ల పునరుద్ధరణపై సంతకాలు సేకరించి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు పాండురంగాచార్యులు వెల్లడించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మందుల జయరాజు, పవన్‌కళ్యాణ్, చలం, కల్లూరి కృష్ణ, సతీష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో నిలిచిన విద్యుదుత్పత్తి

పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ 5వ దశలో సాంకేతిక సమస్య కారణంగా విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. 250 మెగావాట్ల సామర్థ్యం గల తొమ్మిదో యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ లీకేజీ ఏర్పడినట్టు గుర్తించిన అధికారులు సోమవారం అర్ధరాత్రి ఉత్పత్తి నిలిపేశారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడుతున్నామని, బుధవారం నాటికి ఉత్పత్తి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని సీఈ ఎం.ప్రభాకర్ రావు తెలిపారు.

అప్పుడు లేని షరతులు ఇప్పుడెందుకు?



సమావేశంలో మాట్లాడుతున్న గుర్రం అచ్చయ్య

ఖమ్మంమయూరిసెంటర్: అసెంబ్లీ ఎన్నికల సమయాన రూ.2 లక్షల వరకు రైతుల రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు షరతుల పేరిట ఇబ్బంది పెట్టడం ఏమిటని ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య ప్రశ్నించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విధించిన ఆంక్షలతో లక్షలాది మంది రైతులకు రుణమాఫీకి దూరమయ్యారని తెలిపారు. అధికారిక లెక్కల ప్రకారం ఖమ్మం జిల్లాలో 3.71 లక్షల మందికి గాను 1,15,000 మందికి మాత్రమే రుణమాఫీ అయిందని చెప్పారు. రూ.2 లక్షలపైన ఉన్న రుణాలను చెల్లిస్తేనే మాఫీ చేస్తామనడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతోనే నేడు లక్షలాది మంది రైతులు అనర్హులుగా మిగిలిపోతున్నారని ఆరోపించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో ఈనెల 28 కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు లక్ష్మణ్, పాశం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.